# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 101 | పేజీలు : 08 | శనివారం | 18-04-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.




## కేంద్రమంత్రి జోషితో రేవంత్ రెడ్డి భేటీ

ధాన్యం సేకరణ కోసం కేంద్రమంత్రిని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి

కేంద్రమంత్రి జోషితో రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ

30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలని విజ్ఞప్తి

రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులపై చర్చ

2

## ప్రభుత్వం నట్టేట ముంచింది

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలను ప్రభుత్వం నట్టేట ముంచింది: కవిత

ఆరు నెలల్లోగా పీఆర్సీ అమలుచేస్తామన్న హామీ ఏమైందని ప్రభుత్వానికి కవిత ప్రశ్న

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామన్న వాగ్దానాన్ని గాలికి వదిలేశారని విమర్శ

రిటైర్మెంట్ బకాయిల కోసం వృద్ధాప్యంలో ఉద్యోగులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన

2



## ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య కాల్పుల విరమణ

ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య కాల్పుల విరమణను స్వాగతించిన భారత్

శాంతికి దోహదపడే ప్రతి చర్యను సమర్థిస్తామని విదేశాంగ శాఖ వెల్లడి

కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రకటించిన ట్రంప్

హమాస్‌ను ఉగ్రసంస్థగా ప్రకటించాలన్న ఇజ్రాయెల్ విజ్ఞప్తిపై భారత్ ఆచితూచి స్పందన

2





# మీ ఆత్మ ప్రబోధానుసారం నడుచుకోండి

పార్లమెంటు సభ్యులకు ప్రధాని మోదీ పిలుపు

మహిళా రిజర్వేషన్ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించాలని ఎంపీలకు ప్రధాని మోదీ పిలుపు

లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లు

ఇది యుగాలుగా మహిళలకు నిరాకరించిన హక్కు అని, వారికి న్యాయం చేయాలని వ్యాఖ్య

డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని ప్రధాని హామీ

2

హైదరాబాద్ పల్స్,డెస్క్

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ఈ చరిత్రాత్మక బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి చరిత్ర సృష్టించాలని ఆయన పార్లమెంటు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఇది దేశంలోని



## ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు బాంబు బెదిరింపు

మెట్రో స్టేషన్‌లో బాంబు పెట్టినట్లు ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తి

పోలీసులకు సమాచారం అందించిన మెట్రో సిబ్బంది

తనిఖీలు నిర్వహించగా లభ్యం కాని అనుమానాస్పద వస్తువులు

2

# తెలంగాణపై అజ్ఞానంతో మాట్లాడతారా?


తేజస్వి సూర్యపై కోదండరాం నిప్పులు

తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిచేలా తేజస్వి సూర్య వ్యాఖ్యానించారన్న కోదండరాం

తెలంగాణ ఏర్పాటును బ్రిటీష్ కాలం నాటి పరిస్థితులతో ముడిపెట్టడం శోచనీయమని మండిపాటు

ఎంపీ బాధ్యతారహితంగా మాట్లాడుతుంటే కేంద్ర మంత్రులు మౌనంగా ఉన్నారని విమర్శ

2



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ అస్తిత్వాన్ని, అమరుల త్యాగాలను కించపరిచేలా బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలు చేశారని తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏమాత్రం సందర్భం లేకుండా, కనీస అవగాహన లేకుండా తెలంగాణ ఏర్పాటును బ్రిటిష్ కాలం నాటి పరిస్థితులతో ముడిపెట్టడం శోచనీయమని మండిపడ్డారు. రాజ్యాంగంలోని ఆర్టికల్-3 ప్రకారం, అత్యున్నత ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఏర్పాటైన రాష్ట్రాన్ని కించపరచడం అంటే భారత రాజ్యాంగాన్ని



2

## కుప్పకూలిన హెలికాప్టర్

8 మంది దుర్మరణం

ఇండోనేషియా అడవుల్లో కుప్పకూలిన హెలికాప్టర్..

టేకాఫ్ అయిన 5 నిమిషాలకే తెగిపోయిన కాంటాక్ట్

దట్టమైన అటవీ ప్రాంతంలో శకలాల గుర్తింపు

మృతుల్లో ఇద్దరు సిబ్బంది, ఆరుగురు ప్రయాణికులు

## 2 లక్షల లంచం..

ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన ఎక్సైజ్ సీఐ



కామారెడ్డి జిల్లాలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎక్సైజ్ సీఐ

రూ.2 లక్షలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ

కల్లు దుకాణం తరలింపునకు లంచం డిమాండ్ చేసిన సీఐ సత్యనారాయణ

సీఐని అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచిన అధికారులు

2

## రోహిత్ వేముల చట్టంపై కేబినెట్ సబ్ కమిటీ..

ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

## బంగారం దిగుమతులపై కేంద్రం కీలక నిర్ణయం..

15 బ్యాంకులకు అనుమతి

## దక్షిణాదికి అన్యాయం జరగదు

రేవంత్ ఫార్ములా వెనుక అసదుద్దీన్: కిషన్ రెడ్డి

డీలిమిటేషన్ విషయంపై ప్రజలను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తప్పుదోవ పట్టిస్తున్నాయన్న కిషన్ రెడ్డి

అన్ని రాష్ట్రాలకు మోదీ సమన్యాయం చేస్తారని వ్యాఖ్య

జనాభా ప్రాతిపదికన సీట్ల విభజన జరిగినా దక్షిణాది ప్రాధాన్యత తగ్గబోదని వెల్లడి

హైబ్రిడ్ ఫార్ములాను రేవంత్ చేత ఒవైసీ చెప్పించారని విమర్శ

2



## కేటీఆర్ ను టార్గెట్ చేస్తూ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేసిన కవిత

పదేళ్లుగా కేటీఆర్ ప్రజల్లోకి ఎందుకు వెళ్లలేదన్న కవిత

ఇప్పుడు పాదయాత్ర చేస్తానంటే ఎవరు నమ్ముతారని ఎద్దేవా

2



## కేంద్రమంత్రి జోషితో
# రేవంత్ రెడ్డి భేటీ

మొదటి పేజీ రువాయి

కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. వానాకాలం యాసంగి పంటకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలని వారు కేంద్రమంత్రిని కోరారు. 2025–26 సీజన్ కు గాను యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రికి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ధాన్యం సేకరణ, కేంద్ర ప్రభుత్వం వాటా సంబంధిత అంశాలపై కేంద్రమంత్రితో వారు చర్చించారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులను మంజూరు చేయాలని వారు కోరారు.

## ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు
# బాంబు బెదిరింపు

మొదటి పేజీ రువాయి

హైదరాబాద్ నగరంలోని ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు బాంబు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. మెట్రో స్టేషన్‌లో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. మెట్రో రైలు స్టేషన్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అనుమానాస్పద వస్తువులు ఏవీ లభించకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. మెట్రో రైలు స్టేషన్‌లో ఎలాంటి బాంబు లభ్యం కాలేదని పోలీసులు వెల్లడించారు. ఫోన్ చేసిన నెంబర్ ఆధారంగా ఆ వ్యక్తి ఎవరో ఆరా తీసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

# రూ.2 లక్షల లంచం..

మొదటి పేజీ రువాయి

కామారెడ్డి జిల్లాలో ఓ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. బిచ్కుంద ఎక్సైజ్ సీఐగా పనిచేస్తున్న దీను సత్యనారాయణ రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే... ఓ వ్యక్తి తన కల్లు దుకాణాన్ని మరో గ్రామానికి మార్చుకోవడానికి అనుమతి కోరాడు. అదే సమయంలో తనపై ఎలాంటి కేసులు నమోదు చేయవద్దని కూడా విజ్ఞప్తి చేశాడు. ఈ పని చేసిపెట్టడానికి సీఐ సత్యనారాయణ బాధితుడి నుంచి లంచం డిమాండ్ చేశాడు. దీంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఫిర్యాదు స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. బిచ్కుందలోని సీఐ అద్దె ఇంట్లో బాధితుడి నుంచి రూ.2 లక్షలు తీసుకుంటుండగా అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సీఐ వద్ద అదనంగా లభించిన రూ.45,670 నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. సత్యనారాయణపై కేసు నమోదు చేసి, హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు.

# దక్షిణాదికి అన్యాయం జరగదు

మొదటి పేజీ రువాయి

నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై తెలంగాణలో సాగుతున్న ప్రచారాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో మీడియా ముఖంగా మాట్లాడిన ఆయన... ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ 'నార్త్ వర్సెస్ సౌత్' వివాదాన్ని సృష్టించేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ప్రధాని మోదీ సమన్యాయం చేస్తారని, జనాభా ప్రాతిపదికన సీట్ల విభజన జరిగినా దక్షిణాది ప్రాధాన్యత తగ్గబోదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏపీలో సీట్లు 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కు, తమిళనాడులో 39 నుంచి 59కి పెరిగే అవకాశం ఉందని ఆయన గణాంకాలను వివరించారు. మరోవైపు, మహిళా రిజర్వేషన్ బిల్లుపై కూడా కిషన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. మజ్లిస్ పార్టీ తన సీట్లు ఎక్కడ పోతాయో అన్న భయంతో మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తోందని, ఆ పార్టీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ వత్తాసు పలుకుతున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైబ్రిడ్ ఫార్ములా అసలు ఆయనది కాదని, అది అసదుద్దీన్ ఓవైసీ వెనుక ఉండి చెప్పించిన ఫార్ములా అని ఆయన ఆరోపించారు. కేవలం హైదరాబాద్‌లో ఎక్కువ ఆదాయం వస్తుందని అక్కడ సీట్లు పెంచమంటారా? అని ప్రశ్నించిన ఆయన... డబ్బున్న చోట ఓటు విలువ ఎక్కువగా ఉండాలని కోరుకోవడం ఏ రకమైన ప్రజాస్వామ్యం అని నిలదీశారు. మహిళలను అణగదొక్కే రాజకీయాలకు ఎంఐఎం కేంద్ర బిందువుగా మారిందని, విపక్షాలన్నీ కలిసి మహిళా నాయకత్వాన్ని అడ్డుకుంటున్నాయని ధ్వజమెత్తారు.

# కుప్పకూలిన హెలికాప్టర్

మొదటి పేజీ రువాయి

ఇండోనేషియాలో ఘోర హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకుంది. వెస్ట్ కాలిమంతన్ ప్రావిన్స్‌లో జరిగిన ఈ దుర్ఘటనలో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది మృతి చెందారు. దట్టమైన అటవీ ప్రాంతంలోని కొండల మధ్య హెలికాప్టర్ శకలాలను అధికారులు గుర్తించారు. జిన్హువా వార్తా సంస్థ కథనం ప్రకారం మెలావీలోని ఒక ప్లాంటేషన్ ఏరియా నుంచి టేకాఫ్ అయిన కేవలం ఐదు నిమిషాలకే ఎయిర్‌బస్ హెచ్130 హెలికాప్టర్‌తో సంబంధాలు తెగిపోయాయి. అనంతరం గాలింపు చర్యలు చేపట్టగా, గురువారం మధ్యాహ్నం 3:25 గంటల సమయంలో ఇండోనేషియా వైమానిక దళానికి చెందిన సూపర్ ప్యూమా హెలికాప్టర్ మొదట శకలాలను గుర్తించింది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో ఇద్దరు సిబ్బంది, ఆరుగురు ప్రయాణికులు ఉన్నారు. సహాయక బృందాలు ఇప్పటివరకు నాలుగు మృతదేహాలను వెలికితీశాయి. మరో మూడు మృతదేహాలు శకలాల్లోనే చిక్కుకోగా, మరొకరి కోసం గాలింపు కొనసాగుతోంది. చీకటి పడటం, భూభాగం అత్యంత కఠినంగా ఉండటంతో సహాయక చర్యలను తాత్కాలికంగా నిలిపివేశారు. శుక్రవారం ఉదయం తిరిగి ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. రాయిటర్స్ నివేదిక ప్రకారం ఈ హెలికాప్టర్ మాథ్యూ ఎయిర్ నుసంతారాకు చెందినది. చిత్ర మహకోట అనే పామాయిల్ కంపెనీకి చెందిన ప్లాంటేషన్ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది.

# తెలంగాణపై అజ్ఞానంతో మాట్లాడతారా?

మొదటి పేజీ రువాయి

అవమానించడమేనని అన్నారు. తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షను నాటి బీజేపీ అగ్రనేతలు సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ గౌరవించి, మద్దతు తెలిపిన విషయాన్ని కోదండరాం ఈ సందర్భంగా గుర్తు చేశారు. సొంత పార్టీ సీనియర్ నేతలు తీసుకున్న నిర్ణయాలను కూడా అర్థం చేసుకోకుండా తేజస్వీ సూర్య మాట్లాడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ అంత బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతుంటే పక్కనే ఉన్న కేంద్ర మంత్రులు ఆయన్ని నిలువరించకపోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు ఈ వ్యాఖ్యలను ఖండించకపోవడాన్ని బట్టి చూస్తే, వారికి రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమని అర్థమవుతోందని విమర్శించారు. తేజస్వీ వ్యాఖ్యలను తక్షణమే పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించాలని, ఆయనపై బీజేపీ అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వం నట్టేట ముంచింది

మొదటి పేజీ రువాయి

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల దాడిని కల్వకుంట్ల కవిత మరింత ఉధృతం చేశారు. ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలను ప్రస్తుత ప్రభుత్వం నట్టేట ముంచిందని ఆమె ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన కవిత, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ప్రభుత్వం నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. ఆరు నెలల్లోగా పీఆర్సీ అమలు చేస్తామన్న మాట ఏమైందని ప్రశ్నించిన ఆమె, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామన్న వాగ్దానాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రాథమిక అవసరాలైన హెల్త్ స్కీం, వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్ వంటి అంశాల్లోనూ తీవ్ర జాప్యం జరుగుతోందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రిటైర్మెంట్ బకాయిల కోసం వృద్ధాప్యంలో ఉద్యోగులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఐదు వాయిదాల కరవు భత్యం ఊసే లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ఠ అని ఆమె ధ్వజమెత్తారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు నేడు రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు చేపట్టే నిరసన ప్రదర్శనలకు తెలంగాణ జాగృతి తరపున తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆమె ప్రకటించారు. న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు తాము అండగా ఉంటామని స్పష్టం చేస్తూ, ఇప్పటికైనా ప్రభుత్వం మొండివైఖరి వీడి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య
# కాల్పుల విరమణ

మొదటి పేజీ రువాయి

ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడాన్ని భారత్ స్వాగతించింది. శాంతిని నెలకొల్పేందుకు దోహదపడే ప్రతి అడుగునూ తాము సమర్థిస్తామని స్పష్టం చేసింది. ఢిల్లీలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ విషయాన్ని వెల్లడించారు. "మేం కాల్పుల విరమణను స్వాగతిస్తున్నాం. శాంతికి దారితీసే ప్రతి అడుగునూ మేం స్వాగతిస్తాం" అని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ వివాదంతో ముడిపడి ఉన్న మరో సరిహద్దులో ఉద్రిక్తతలను తాత్కాలికంగా తగ్గించే లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ఈ కాల్పుల విరమణను ప్రకటించిన విషయం తెలిసిందే. లెబనాన్ అధికారికంగా ఇజ్రాయెల్‌తో యుద్ధంలో లేనప్పటికీ, హెజ్బొల్లా సంస్థ ఆ దేశ దక్షిణ ప్రాంతాన్ని నియంత్రిస్తూ ఇజ్రాయెల్‌పై దాడులు చేస్తోంది. దీనికి ప్రతిగా ఇజ్రాయెల్ జరుపుతున్న ప్రతీకార దాడులతో లెబనాన్ తీవ్రంగా నష్టపోతోంది.

**హమాస్‌పై ఇజ్రాయెల్ ఒత్తిడి**

ఇదే సమావేశంలో, హమాస్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని ఇజ్రాయెల్ కోరుతున్న విషయంపై మీడియా ప్రశ్నించగా, జైస్వాల్ ఆచితూచి స్పందించారు. "మాకు ఒక నిర్దిష్ట ప్రక్రియ ఉంది, ఆ ప్రక్రియ ప్రకారమే ఇలాంటి అంశాలను పరిష్కరిస్తాం" అని ఆయన తెలిపారు. కాగా, అంతకుముందు గురువారం ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ ప్రముఖులతో జరిగిన వర్చువల్ సమావేశంలో ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ మాట్లాడుతూ, భారత్ హమాస్‌ను ఉగ్రసంస్థగా ప్రకటించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. హమాస్‌కు లష్కరే తోయిబా వంటి ఇతర రాడికల్ ఇస్లామిస్ట్ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయని ఆయన ఆరోపించారు. భారత్‌తో సంబంధాల బలోపేతానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని కూడా సార్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

## రోహిత్ వేముల చట్టంపై
# కేబినెట్ సబ్ కమిటీ..

మొదటి పేజీ రువాయి

తెలంగాణలోని ఉన్నత విద్యాసంస్థల్లో సామాజిక గుర్తింపు ఆధారిత వివక్షను నిరోధించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై "రోహిత్ వేముల తెలంగాణ (ఉన్నత విద్యలో గుర్తింపు ఆధారిత వివక్ష నివారణ) బిల్లు, 2026" రూపకల్పన కోసం ఒక కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఈ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనరసింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఇందులో సభ్యులుగా ఉంటారు. ఈ బిల్లుపై అధ్యయనం చేసి, చట్ట రూపకల్పనకు అవసరమైన సిఫార్సులు, సూచనలను సబ్ కమిటీ ప్రభుత్వానికి అందిస్తుంది. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జీవో ఆర్టీ నెం.490ని జారీ చేశారు. వీలైనంత త్వరగా తమ నివేదికను సమర్పించాలని కేబినెట్ సబ్ కమిటీని ఆదేశించారు.

## బంగారం దిగుమతులపై
# కేంద్రం కీలక నిర్ణయం..

మొదటి పేజీ రువాయి

బంగారం, వెండి దిగుమతుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని 15 ప్రధాన బ్యాంకులకు పసిడి, వెండిని దిగుమతి చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) శుక్రవారం ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ అనుమతులు 2026 ఏప్రిల్ 1 నుంచి 2029 మార్చి 31 వరకు మూడేళ్ల పాటు అమల్లో ఉంటాయి. బులియన్ దిగుమతులను క్రమబద్ధీకరించడం, నియంత్రిత మార్గాల ద్వారా వాటిని ట్రాక్ చేయడం ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. దీని ద్వారా పారదర్శకతను పెంచడంతో పాటు, బంగారం, వెండి వ్యాపారంలో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి అధికారం పొందిన ఈ బ్యాంకుల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యెస్ బ్యాంక్ వంటి దిగ్గజ ప్రైవేట్, ప్రభుత్వ రంగ బ్యాంకులు ఉన్నాయి. అయితే, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్బేర్‌బ్యాంక్ (హ్ఎవతీఝఅన)లకు మాత్రం కేవలం బంగారం దిగుమతికి మాత్రమే అనుమతి లభించింది. ఈ నేపథ్యంలో, దేశంలో బంగారం మార్కెట్ సరళిపై ప్రపంచ స్వర్ణ మండలి (వరల్డ్ గోల్డ్ కౌన్సిల్) విడుదల చేసిన నివేదిక ఆసక్తికర విషయాలను వెల్లడించింది. దీని ప్రకారం, 2026 మార్చి నెలలో భారత్ బంగారం దిగుమతులు భారీగా తగ్గి 9 నెలల కనిష్ఠ స్థాయికి చేరాయి. ఆ నెలలో కేవలం 3.1 బిలియన్ డాలర్ల విలువైన పసిడి మాత్రమే దిగుమతి అయింది. పరిమాణం పరంగా చూస్తే ఇది 20–25 టన్నులు మాత్రమే. సాధారణంగా 12 నెలల సగటు దిగుమతి 62 టన్నులుగా ఉండగా, అందులో ఇది చాలా తక్కువ. మధ్యప్రాచ్యం నుంచి విమాన రాకపోకలకు అంతరాయాలు కలగడం, డిమాండ్ తగ్గడం వంటివి ఇందుకు కారణాలని నివేదిక పేర్కొంది. అయితే, మార్చిలో పడిపోయిన బంగారం ధరలు ఏప్రిల్‌లో పాక్షికంగా కోలుకున్నాయి. దిగుమతులపై ఆంక్షలు, సరఫరా సమస్యల కారణంగా దేశీయ మార్కెట్‌లో డిస్కౌంట్లు తగ్గాయి. ఇదే సమయంలో, 2026 మొదటి త్రైమాసికంలో లిస్టెడ్ జ్యువెలరీ సంస్థలు బలమైన వృద్ధిని నమోదు చేశాయి. వివాహాల సీజన్, అధిక విలువైన కొనుగోళ్లు, సంస్థల విస్తరణ ఇందుకు దోహదపడ్డాయని తెలిపింది. మరోవైపు, పెట్టుబడిదారుల్లో బంగారంపై ఆసక్తి కొనసాగుతోంది. భారత గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి వరుసగా 11వ నెల కూడా పెట్టుబడులు వెల్లువెత్తాయి. మార్చిలో నికరంగా రూ. 22.7 బిలియన్ల (244 మిలియన్ డాలర్లు) పెట్టుబడులు వచ్చినట్లు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా గణాంకాలు చెబుతున్నాయి. అలాగే, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా డిజిటల్ గోల్డ్ కొనుగోళ్లు కూడా బలంగానే ఉన్నాయి. ఫిబ్రవరిలో రూ. 30.3 బిలియన్ల విలువైన డిజిటల్ బంగారం కొనుగోళ్లు జరిగాయని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ వివరించింది.

## కేటీఆర్ ను టార్గెట్ చేస్తూ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేసిన కవిత

మొదటి పేజీ రువాయి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన సోదరుడు కేటీఆర్ పై విమర్శల దాడిని ఉధృతం చేశారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో పలు సామాజిక సంఘాల నేతలతో భేటీ అయిన ఆమె, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై రాజీకయంగా అత్యంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ ఎందుకు ప్రజల్లోకి పోలేదు? ఇప్పుడు పాదయాత్రలు చేస్తానంటే ఎవరు నమ్ముతారు?" అని ఆమె సూటిగా ప్రశ్నించారు. కేటీఆర్ పాదయాత్ర ప్రస్తావనను ఎద్దేవా చేస్తూ, అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను పట్టించుకోని వారు ఇప్పుడు ప్రజల్లోకి వెళ్లడం వెనుక అర్థమేంటని నిలదీశారు. సామాజిక తెలంగాణే లక్ష్యంగా తాను కొత్త రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టానని, అందుకే తనకు అనేక కష్టాలు వచ్చాయని కవిత పేర్కొన్నారు. "అందరికీ అధికారం అందాలని నేను మాట్లాడటం మొదలుపెట్టాకే నాకు సమస్యలు ఎదురయ్యాయి. బీఆర్ఎస్ నన్ను సస్పెండ్ చేసినా, సామాజిక తెలంగాణ సాధించే వరకు నా పోరాటం ఆగదు" అని ఆమె స్పష్టం చేశారు. తన కొత్త పార్టీకి మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ వంటి బహుజన సంఘాలు మద్దతు తెలపడం తనకు కొండంత బలాన్ని ఇస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. వీరన్న అనుచరులు తనతో కలవడమంటే ఇక తమను ఆపే శక్తే లేదని ఆమె ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారని, సమయం వచ్చినప్పుడు వారి పేర్లు బయటపెడతానని బాంబు పేల్చారు. గ్రహగతులు అనుకూలించాలని, ఏదైనా శని అడ్డు ఉంటే తొలగిపోవాలని వారణాసిలో పూజలు చేసినట్లు కూడా ఆమె వెల్లడించారు.

# మీ ఆత్మ ప్రబోధానుసారం నడుచుకోండి

మొదటి పేజీ రువాయి

సగం జనాభా అయిన మహిళలకు దక్కాల్సిన హక్కు అని, వారి శక్తికి కొత్త అవకాశాలు కల్పించాలని కోరారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే 'నారీ శక్తి వందన్ అధినియమ్' అమలు కోసం ప్రభుత్వం ఈ ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తోంది. ఈ బిల్లును 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి అమలు చేయడమే లక్ష్యంగా అవసరమైన రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. భవిష్యత్తులో జనాభా గణన, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) తర్వాత ఈ రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, "దయచేసి మీ మనస్సాక్షి చెప్పినట్టు నడుచుకోండి. మీ కుటుంబంలోని మహిళలను గుర్తుచేసుకోండి. ఇది మహిళలకు మనం ఇస్తున్నాం అనుకోకండి... యుగాలుగా వారికి నిరాకరించబడిన హక్కును తిరిగి ఇవ్వడం మన బాధ్యత అని గుర్తించండి" అని పేర్కొన్నారు. ఈ బిల్లు ఆమోదం ఘనతను ప్రతిపక్షాలే తీసుకోవచ్చని, తనకు క్రెడిట్ అవసరం లేదని స్పష్టం చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని ప్రధాని స్పష్టమైన హామీ ఇచ్చారు. ప్రస్తుతం లోక్‌సభలో ఈ బిల్లులపై చర్చ కొనసాగుతుంది.

# పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**భారతినగర్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి**

**సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌ను కలిసి అభివృద్ధి అంశాలు చర్చించారు**

**రామచంద్రపురం, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17 :** భారతినగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ఈరోజు సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజనని కలిసి డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, కొత్త బడ్జెట్ కేటాయింపులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలిసింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, భారతినగర్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్‌ను కోరారు. అలాగే, ఇప్పటికే కొనసాగుతున్న పనులను కాంట్రాక్టర్లు మరింత వేగంగా పూర్తి చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

బాంబే కాలనీ కమ్యూనిటీ హాల్‌కు ధర నిర్ణయం

బాంబే కాలనీ కమ్యూనిటీ హాల్‌కు ధరను త్వరగా నిర్ణయించాలని మాజీ కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు. ఈ హాల్ స్థానికుల అవసరాలకు మేల్కొలపడేలా ఉపయోగించుకోవాలని, దానికి సరైన ధర నిర్ణయం తప్పనిసరని పేర్కొన్నారు. బీటీ రోడ్‌కు బడ్జెట్ కేటాయించాలి. ఎంఎంటీఎస్ నుంచి అన్నమయ్య ఎన్‌క్లేవ్ వరకు బీటీ రోడ్ నిర్మాణానికి బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఈ రోడ్ పూర్తయితే స్థానికులకు భారీగా ప్రయోజనం కలుగుతుందని, ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని సింధు ఆదర్శ్ రెడ్డి తెలిపారు.

హెచ్‌ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి పనులు వేగవంతం చేయాలి

భారతినగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న హెచ్‌ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి (హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సెవరేజ్ బోర్డ్) పనులను త్వరితగతిన ప్రాసెస్ చేసి బోర్డుకు పంపాలని కమిషనర్‌ను కోరారు. నీటి సరఫరా, సెవరేజ్ సమస్యలు తీర్చడానికి ఇది కీలకమని ఆయన గుర్తు చేశారు.ఓల్డ్ ఎంఐజీ కాలనీలో స్పోర్ట్స్ ఫైల్‌కు బడ్జెట్ఓల్డ్ ఎంఐజీ కాలనీలో స్పోర్ట్స్ ఫైల్‌కు బడ్జెట్ కేటాయించి టెండర్ ప్రక్రియను త్వరగా ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. యువకులకు స్పోర్ట్స్ సౌకర్యాలు అందించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం సృష్టించవచ్చని మాజీ కార్పొరేటర్ అభిప్రాయపడ్డారు.కమిషనర్ సృజన ఈ అంశాలన్నింటినీ సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక అభివృద్ధికి మాజీ కార్పొరేటర్ కృషి అభినందనీయమని సింధు ఆదర్శ్ రెడ్డి తెలిపారు.



# సిగాచి బాధితులకు హామీలు.. ప్రభుత్వ నాటకం!

**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17:** సంగారెడ్డి పాశమైలారంలోని సిగాచి పరిశ్రమ అగ్నిప్రమాదంలో 54 మంది కార్మికులు మరణించారు. ప్రమాద సమయంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు వివేక్ వెంకటస్వామి, దామోదర్ రాజనర్సింహ మృతదేహాల సామీప్యంలో ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి పరిహారం ప్రకటించారు.అసెంబ్లీలో బట్టబయలయ్యే మోసం! అసెంబ్లీలో ప్రభుత్వం సమర్పించిన లిఖిత సమాధానం ప్రకారం, 54 బాధిత కుటుంబాలకు మొత్తం రూ. 24.51 కోట్లు మాత్రమే చెల్లించారు.

- సగటున ఒక్కో కుటుంబానికి రూ. 45.40 లక్షలు అందాయి,అంటే రూ. 54.60 లక్షలు బకాయిగా మిగిలాయి.మొత్తం రూ. 29.48 కోట్లు ఎగ్గొట్టారని హరీశ్ రావు ఆరోపించారు.

**యాజమాన్య మోసాలు.. ప్రభుత్వ అసమర్థత!**

సిగాచి యాజమాన్యం కోర్టులో రూ. 40-42 లక్షలు చెల్లించామని చెప్పింది, కానీ అందులో పిఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్‌లు కలిపి చూపించారు. సొంత పరిహారం రూ. 25 లక్షలు మాత్రమే.

ప్రభుత్వం యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడం, ఎండీ అరెస్టు తర్వాత బెయిల్‌కు సహకారం చేయడం విమర్శకు గురయ్యాయి.

**భద్రతా నిర్లక్ష్యం.. సామూహిక హత్య!**

ఫ్యాక్టరీలో 818 హెచ్.పి అనుమతికి 1777 హెచ్.పి యంత్రాలు, సేఫ్టీ గార్డ్స్ లేకపోవడం, ఫైర్ ఎన్‌ఓసి లేకపోవడం, డస్ట్ కంట్రోల్ సిస్టమ్ పనిచేయకపోవడం విచారణలో తేలింది. 8 మంది కార్మికుల డెత్ సర్టిఫికెట్ల కోసం నెలలు తిప్పడం దారుణమని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

**హరీశ్ రావు డిమాండ్లు!**



యాజమాన్య ఆస్తులు రెవెన్యూ రికవరీ చట్టం కింద అటాచ్ చేసి, రూ.1 కోటి పరిహారం చెల్లించాలి. పిఎఫ్, ఈఎస్ఐ తో సంబంధం లేకుండా పూర్తి హామీ నెరవేర్చాలని, బాధితులను మోసం చేయకూడదని సూచించారు.

# పటేల్‌గూడ ఎస్.సి.ఆర్.పి.ఎస్ కు జయ ప్రశాంత్ కుమార్ అధ్యక్షుడు

**అమీన్పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17 :** అమీన్పూర్ డివిజన్ పటేల్‌గూడ గ్రామంలో డా.బీ.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం నూతన కమిటీ ఏర్పాటు అమీన్పూర్ డివిజన్ పటేల్‌గూడెం గ్రామంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. రుద్రారం శంకర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రుద్రారం ఉపాధ్యక్షుడిగా అధ్యక్షత వహించారు.

**నూతన కమిటీ వివరాలు:**

అధ్యక్షుడు: జయ ప్రశాంత్ కుమార్.
ఉపాధ్యక్షుడు: కె.నర్సింగరావు.
ప్రధాన కార్యదర్శి: జయ్ బాల్ రాజ్.
జ్వాయింట్ సెక్రటరీ: కె.ప్రవీణ్
సెక్రటరీ: ఎన్.గణేష్.
ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు: జె.గోపాల్, కె.రాములు, కలక్ష్మణ్, జె.విటల్, జె.నందు, జె.జాషువా మొదలైనవారు.డా.బీ.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా కొత్త కమిటీ ప్రతి సభ్యుడు ప్రమాణ స్వీకారం చేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ రుద్రారం శంకర్ ధన్యవాదాలు తెలిపారు.

**ముఖ్య అతిథులు:**

జాతీయ సెక్రటరీ జనరల్: గణేష్



గోపాల్సంగారెడ్డి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్: పి.పి.బైగల్ల శ్రీరాములుజాతీయ నాయకులు: బలవంతు, స్టేట్ ఆర్గనైజర్ సెక్రటరీ తప్పు యాదయ్య బొడ్డు రాములు, బ్యాతోల్ వెంకటేష్మాజీ అధ్యక్షుడు: జయ్ శీనుమాజీ సెక్రటరీ: లక్ష్మణ్ఈ కార్యక్రమంలో స్థానిక సంఘ సభ్యులు, నాయకులు విపరీతంగా పాల్గొన్నారు.

# పాలకుల మెప్పు కోసం జాతికి అన్యాయం

## ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్లచంద్ర స్వామి మాదిగ






**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రావ్ భవనంలో శుక్రవారం రోజు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి అనుబంధ సంఘాల ప్రెస్ మీట్ కార్యక్రమం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్లచంద్ర స్వామి మాదిగ హాజరై మాట్లాడుతూ .... 1) ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 15 శాతం రిజర్వేషన్లలో వర్గీకరణ ప్రకారం జనాభా ప్రాతిపదికన 11% రిజర్వేషన్లు మాదిగల కేటాయించాలి. 2) మాదిగల జనాభా 10 నుండి 11% ఉంటుందని మా అధినేత మందకృష్ణ మాదిగ మొదటి నుండి చెబుతున్నారు అది కుల గణన సర్వేతో స్పష్టమైంది. 3) కుల గణన ఇంకా పూర్తిస్థాయిలో శాస్త్రీయంగా జరగలేదు. అలా జరిగితే మా జనాభా ఇంకా రెట్టింపు స్థాయిలో పెరుగుతుందనేది నిజం. 4) కొంతమంది మేధావుల ముసుగులో జాతికి అన్యాయం చేసే విధంగా కేటాయించిన 9 శాతం రిజర్వేషన్లను స్వాగతించారు. వారు జాతికి ద్రోహం చేశారు అనేది రుజువైంది. 5) పాలకుల మెప్పు కోసం జాతికి అన్యాయం చేసే విధంగా వ్యవహరించిన ద్రోహులకు జాతిలో స్థానం ఉండదు. 6) ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చే సందర్భంలోనే మంద కృష్ణ మాదిగ 11% శాతం వాటా మాదిగలకు కేటాయించాలని రేవంత్ రెడ్డి ని స్వయంగా కలిసి విజ్ఞప్తి చేశారు. 7) మాదిగలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాల్సిన బాధ్యత ప్రస్తుతం రేవంత్ రెడ్డి మీదనే ఉన్నది. 8) మాదిగల్లో ఉన్న పేదరికం తొలగించడానికి అన్ని రకాల నిర్ణయాలు తీసుకోవాలి. 9) మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో మాదిగ జాతి మరింత సంఘటితం కావాలి. బలమైన శక్తిగా ఎదగాలి. 10) మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశత జయంతి ఉత్సవాల అత్యున్నత కమిటీలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ కి చోటు కల్పించినందుకు భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి యావత్తు మాదిగ జాతి తరుపున కృతజ్ఞతలు. ఇది మా జాతికి లభించిన గుర్తింపు, గౌరవం అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద శంకర్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి సందేలా శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగ, ఎమ్మార్పియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగ స్వామి మాదిగ,

ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షులు కుతాడి సురేష్, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు కోట ఉపేందర్ మాదిగ, బండారు శివ శంకర్ మాదిగ, కందుల నర్సింగరావు మాదిగ, దర్గాయి దేవేందర్ మాదిగ, అందే సాయి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో పరమశివుడికి రుద్రాభిషేక పూజలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా ముక్కోటి పరమశివుడికి విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షులు నంగునూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆలయ ట్రస్టు అభివృద్ధి సేవా కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించగా రంగ నరసింహులు లక్ష్మి, ఉప్పల రమేష్ స్వప్న దంపతులు పూజల్లో పాల్గొన్నారు. వల్లకాటి సురేష్ భక్తి గీతాలు ఆలపించగా భజన కార్యక్రమం జరిగింది. శ్రీ స్వామివారికి పంచామృత ఫలరసాభిషేకాలు లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం మంగళహారతి మంత్రపుష్పం అలంకరణ పూజా కార్యక్రమాలు మహిళలు భక్తులు అభిషేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చక స్వాములు తీర్థ ప్రసాద వితరణ వేద ఆశీర్వచన కార్యక్రమాలు నిర్వహించారు.

# గ్రామ ప్రజలకు తాగునీటి సమస్యకు పరిష్కారం... బోరింగ్‌కు కొత్త మోటార్ ఏర్పాటు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, మహబూబాబాద్ జిల్లా :** డోర్నకల్ మండలం రాముతండా గ్రామంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా సర్పంచ్ వినోద్ నాయక్, శుక్రవారం ముందడుగు వేశారు. గ్రామంలోని బోరింగ్‌కు కొత్త మోటార్ ఏర్పాటు చేసి, నిరంతర నీటి సరఫరా అందేలా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ వినోద్ నాయక్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల సమస్యలు తన దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కట్టుబడి ఉన్నామని అన్నారు. అలాగే గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రజలతో నిత్యం సంప్రదింపులు జరుపుతూ వారి సమస్యలను తెలుసుకొని తక్షణమే పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఈ చర్యతో గ్రామ ప్రజలు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లాలో జనగణన శిక్షణ ప్రారంభం : అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

## 18 నుంచి తొలి దశ తరగతులు.. 13 కేంద్రాల్లో నిర్వహణ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యదాద్రి భువంగిరి జిల్లాలో జనగణన తొలి దశకు సంబంధించిన శిక్షణ తరగతులు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నట్లు జిల్లా ప్రధాన జనగణన అధికారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తెలిపారు. మొదటి దశలో భాగంగా జిల్లాలోని 13 ఛార్జ్ లెవెల్ కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 18, 20, 21 తేదీలలో ఈ తరగతులు కొనసాగుతాయని వెల్లడించారు. ఈ శిక్షణలో భాగంగా ప్రతి కేంద్రంలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నారు. జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన విధి విధానాలు, బాధ్యతలు, సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. హాజరయ్యే సిబ్బంది సమయానికి హాజరై మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకుని కచ్చితంగా పాటించాలని సూచించారు.

# సియా గులేరియా హత్యపై నిరసనలు... నిందితులకు కఠిన శిక్షలు విధించాలని ఎస్ఎఫ్ఐ ఆందోళన





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, మహబూబాబాద్, ప్రతినిధి :** విద్యార్థి నాయకురాలు సియా గులేరియా హత్య ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు గంధసిరి జ్యోతిబసు మాట్లాడుతూ, సమాజంలో సమానత్వం కోసం, స్వాతంత్ర్యం ప్రజాస్వామ్యం సోషలిజం సిద్ధాంతాలతో పోరాడుతున్న 19 ఏళ్ల యువ విద్యార్థిని హత్య చేయడం అత్యంత క్రూరమైన చర్య అని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు సమాజానికి ప్రమాదకర సంకేతాలని అన్నారు. ఈ దారుణానికి పాల్పడిన నిందితులను తక్షణమే పట్టుకుని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుండ్ల రాకేశ్, నాయకులు వంశీ, వరుణ్ తేజ్, కిరణ్, విద్యార్థినిలు సంధ్య, రేష్మ, జాస్మిన్, మానస, మౌనిక, నర్మద తదితరులు పాల్గొన్నారు.

# రాజపేటలో ఆర్యవైశ్యుల ప్రతి మాస అన్న ప్రసాద వితరణ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలో శుక్రవారం ఆర్య వైశ్యులు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆధ్వర్యంలో ఆలయం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా ప్రజల అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పెద్దల జ్ఞాపకార్థం ఆర్యవైశ్యులు ఈ కార్యక్రమాన్ని ప్రతి అమావాస్య రోజు చేపడుతుండగా పాల్గొన్న పలువురు ప్రత్యేకంగా అభినందించారు. మొదటగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి నైవేద్య సమర్పణ అనంతరం కార్యక్రమాన్ని నిర్వహించగా రాజపేట పట్టణంలోని ఆర్య వైశ్యులు పాల్గొని అన్న ప్రసాద వితరణ చేశారు.

# ఆత్మకూర్లో చేనేత కార్మికులకు ఉచిత వైద్య శిబిరం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని చేనేత కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆత్మకూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సర్పంచ్ బీసు ధనలక్ష్మి ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై కార్మికులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చేనేత వృత్తిలో ఎక్కువసేపు ఒకే భంగిమలో పనిచేయడం వల్ల కార్మికుల్లో వెన్నునొప్పి, కీళ్ల నొప్పులు, కంటి సమస్యలు, శ్వాసకోశ సమస్యలు, రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులు అధికంగా కనిపిస్తున్నాయని తెలిపారు. శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలు, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయి, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఉన్నత స్థాయి చికిత్స కోసం రిఫరల్ సౌకర్యం కల్పించారు. మొత్తం 192 మంది చేనేత కార్మికులు, వారి కుటుంబ సభ్యులు సేవలు పొందగా, అందులో 80 మంది పురుషులు, 112 మంది మహిళలు ఉన్నారు. సాధారణ వైద్యం, ఆర్థోపెడిక్, కంటి విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీఓ (హ్యాండ్లూమ్స్) సత్యనారాయణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుమన్ కళ్యాణ్, డాక్టర్ అమరావతి తదితరులు పాల్గొన్నారు.

# బీసీల రాజ్యాధికార దిశగా టీఆర్పీ అడుగులు

**పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**






**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు నియోజకవర్గం, తుర్కపల్లి మండలం ఇందిరా నగర్ గ్రామంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ... బీసీలకు సముచిత హక్కులు రావాలంటే రాజకీయ అధికారాన్ని సాధించడం అత్యవసరమని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి టీఆర్పీ కట్టుబడి ఉందని తెలిపారు. ఇందిరా నగర్ గ్రామంలో పార్టీకి లభిస్తున్న మద్దతు భవిష్యత్తులో పెద్ద మార్పుకు దారితీస్తుందని అన్నారు. ఈ కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు కొమిరిశెట్టి నర్సింహులు ఆధ్వర్యంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ప్రతి గ్రామానికి పార్టీని విస్తరించేందుకు కృషి చేస్తున్నామని, ముఖ్యంగా బీసీ యువతను చైతన్యపరుస్తూ పార్టీలోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు యువకులు తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరి తమ మద్దతును తెలియజేశారు.

# పోలీసు పెట్రోలింగ్‌ను బురిడీ కొట్టిస్తున్న ఇసుక మాఫియా

**ప్రభుత్వానికి లక్షల రూపాయల నష్టం**
**ఇసుక దోపిడీ వల్ల**
**ఎమ్మెల్యే ఆదేశాలు కాగితాల్లోనే**
**అధికారులు ఆఫీసుల్లోనే**
**కలెక్టర్ , ఎస్పి చర్యలు తీసుకోవాలి అని స్థానికుల డిమాండ్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
బూర్గంపహాడ్ మండలంలో అక్రమ ఇసుక రవాణా దందా రోజురోజుకూ విపరీతంగా పెరుగుతోంది. మండల వ్యాప్తంగా పోలీసు, రెవిన్యూ, మైనింగ్ శాఖల అధికారులు ఇటీవల గొమ్మూరు, సారపాక ప్రాంతాల్లో ట్రంచులు తీయించి భారీగా ఇసుక నిల్వలను సీజ్ చేశారు. ఈ చర్యలతో కొన్ని రోజులు ఇసుక రవాణా తగ్గినట్లు కనిపించినా, త్వరలోనే అది మళ్లీ జోరుగా మారింది. ఇసుక మాఫియా ఈ సీజ్ చర్యలకు సవాలు విసురుతూ కొనసాగుతోంది. స్థానిక ఎమ్మెల్యే రివ్యూ సమావేశంలో అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేసి, నేరారోపణలు జారీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కానీ స్థానికంగా పరిస్థితి ఏమీ మారలేదు. ఎమ్మెల్యే ఆదేశాలు కాగితాలకే పరిమితమయ్యాయనే తీవ్ర విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. మండలంలోని పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి, తెల్లవారుజామున వేళల్లో విచ్చలవిడిగా ఇసుక రవాణా జరుగుతోంది. పోలీసు పెట్రోలింగ్ చేస్తున్నప్పటికీ, వారిని కూడా బురిడి కొట్టిస్తూ ఇసుక మాఫియా దందాను నడుపుతోంది. కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌ల కనుసందనలోనే ఈ అక్రమాలు జరుగుతున్నట్లు స్థానికుల నుంచి సమాచారం అందుతోంది. గ్రామ పంచాయితీ నాయకుల అసహకారం లేదా మౌనం కారణంగా ఈ దందా సులభంగా కొనసాగుతోందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లారీలు, ట్రాక్టర్లు, డంపర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి లక్షలాది రూపాయల నష్టం కలిగిస్తున్నారు. ఇసుక మాఫియా గ్రామీణ రహదారులను ఉపయోగించుకుని నగరాల వైపు తీసుకెళ్తోంది. ప్రజలు ఈ అక్రమ రవాణా వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులు భారీ వాహనాలతో దెబ్బతిని, ప్రధాన మార్గాలు గుంటల్లా మారాయి. రాత్రి వేళల్లో వాహనాల అతివేగం వల్ల ప్రమాదాలు పెరిగాయి. రైతుల పొలాలు దెబ్బతినడం, నీటి మార్గాలు ముసుగుపడడం వంటి సమస్యలు తలెత్తాయి. స్థానికులు రాత్రి వేళల్లో భయంగా ఉంటున్నారు. ఈ దందా వల్ల పర్యావరణానికి కూడా నష్టం వాటిల్లుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు కఠినంగా వ్యవహరించకపోవడం మీద ప్రజల నుంచి తీవ్ర ప్రశ్నలు లేవనెత్తున్నాయి. రెవిన్యూ చర్యలు ఫలించకపోవడంతో ఇసుక దోపిడి జోరుగా మారింది. అధికారుల నిర్లక్ష్యం లేదా మాఫియాతో కుమ్మక్కు కారణంగా ఈ దందా కొనసాగుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరి మీడియా వాళ్ళు ఏం చేస్తారో చేసుకోండి అంటూ కొంతమంది వ్యక్తులు మీడియా జర్నలిస్టులతో వాగ్వివాదానికి దిగినట్లు సమాచారం. ఈ హెచ్చరికలు జర్నలిస్టులను కూడా భయపెడుతున్నాయి. ఇకనైనా కలెక్టర్ దృష్టి సాధించాలని, అధికారులు, పంచాయితీ నాయకులు కఠిన చర్యలు తీసుకుని అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యకు త్వరిత పరిష్కారం లేకపోతే పెద్ద ఉద్యమం నడుప్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సవాల్ స్వీకరించి బహిరంగ చర్చకు రావాలి...

**కాంగ్రెస్ శ్రేణులు అర్థరహిత విమర్శలు మానుకోవాలి.....**
**బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** చల్లూరు క్రషర్ వ్యవహారంలో బహిరంగ చర్చకు సిద్ధమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేసిన సవాలును బిఆర్ఎస్ పార్టీ ఆలేరు నియోజకవర్గం బిఆర్ఎస్ నేత కల్లూరి రామచంద్ర రెడ్డి స్వాగతించారని, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కి సవాల్ విసిరినట్టు కాంగ్రెస్ శ్రేణులు విమర్శలు చేయడం తగదని రాజపేట మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ అన్నారు. శుక్రవారం రాజపేటలో విలేకరుల సమావేశంలో మండల బిఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. కలెక్టర్, జర్నలిస్టులు, అఖిలపక్ష రాజకీయ పార్టీల సమక్షంలో చల్లూరు క్రషర్ వద్ద చర్చకు సిద్ధమని కల్లూరి రామచంద్ర రెడ్డి ప్రకటన చేయగా మళ్లీ బహిరంగ చర్చకు సిద్ధమేనా? అంటూ కాంగ్రెస్ శ్రేణులు ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు తరుముకున్నట్టుగా చల్లూరు క్రషర్ వ్యవహారంలో కాంగ్రెస్ వ్యవహార శైలి కనిపిస్తున్నదని, తప్పు లేకుంటే ఎందుకు భయపడుతున్నారు? అన్నారు. ఆదాబ్ హైదరాబాద్, నమస్తే తెలంగాణ, తెలుగు దినపత్రికల్లో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా క్రషర్ నడుస్తున్నదని, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు ఎగ్గొట్టారని పత్రిక శీర్షికలలో ప్రచురితమైన కథనాలు మీరు చదవలేదా? అన్నారు. రాజపేట పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వీడియో రికార్డ్ చేసి విడుదల చేసిన దాంట్లో చాలా స్పష్టంగా చల్లూరు క్రషర్ వ్యవహారంలో బహిరంగ చర్చకు సిద్ధమంటూ ప్రతిపక్షాలకు సవాల్ చేశారని, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను నాయకులను గుండాలుగా పేర్కొంటూ ఆ వీడియోలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఏం మాట్లాడారన్నది కాంగ్రెస్ శ్రేణులు మరో మారు వినాలన్నారు. చల్లూరు క్రషర్ వ్యవహారంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య బహిరంగ చర్చకు సిద్ధమని చేసిన సవాల్ పై నిలబడాలని, క్రషర్ వ్యవహారం అంతా విచారణ జరిపించి, ఆలేరు ప్రజలకున్న అనుమానాలను నివృత్తి చేసి, చిత్తశుద్ధిని చాటుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, మాజీ డైరెక్టర్ చింతలపూరి వెంకటరామిరెడ్డి, గోపగాని యాదగిరి గౌడ్, ఎరుగోకుల జశ్వంత్, బొంగోని ఉప్పలయ్య, బెడిదే వీరేశం, నరసాపురం మాజీ సర్పంచ్ నాగిర్తి గోపాల్ రెడ్డి, ఎమ్మ భాస్కర్, గంధమల్ల సురేష్, సతీష్, విష్ణు, గొల్ల రాజయ్య, ఉపేందర్, బిఆర్ఎస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి-అందోల్ సమస్యలపై కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, సంగారెడ్డి ప్రతినిధి:**
సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ కలిసి రెండు నియోజకవర్గాలకు సంబంధించిన పలు కీలక సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అందోల్ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను చంటి క్రాంతి కిరణ్ వివరించారు. సింగూర్ ప్రాజెక్టు నుంచి నీటి అసమాన పంపిణీ కారణంగా గత రెండున్నర సంవత్సరాలుగా లెఫ్ట్ కాలువ ద్వారా అందోల్ ప్రాంతానికి నీరు అందడం లేదని, దీంతో పుల్కల్, అందోల్ మండలాల్లోని సాగుభూములు పాడుబడుతున్నాయని తెలిపారు. సింగూర్ డ్యామ్‌లో నీరు ఉన్నప్పటికీ "రిపేర్ పనులు" పేరుతో ఆలస్యం జరుగుతోందని విమర్శించారు. అలాగే ముందస్తు సమాచారం లేకుండా నీరు విడుదల చేయడంతో పోచారం, ముద్దాయిపేట్, పుల్కల్, మిమ్మూర్, ఈసాజీపేట్, గంగోజిపేట్ గ్రామాల్లో వరదలు వచ్చి వందల ఎకరాల పంటలు నష్టపోయాయని, బాధిత రైతులకు ఇప్పటివరకు పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు క్రాప్ హాలిడే లేదా తగిన పరిహారం ఇవ్వడం, కాలువలు--డ్యామ్ మరమ్మతులు వేగవంతం చేయడం, వచ్చే సీజన్ నుంచి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవడం, నష్టపోయిన రైతులకు తక్షణ సహాయం అందించాలని కోరారు. ఇక సంగారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గిర్మాపూర్ సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో తాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరగా, కలెక్టర్ దీనిపై సానుకూలంగా స్పందించారు. అలాగే నియోజకవర్గంలోని పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని త్వరిత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇద్దరు నేతలు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జైపాల్ రెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# వంజిరిలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కగజ్‌నగర్ మండల వంజిరి గ్రామ పంచాయతీలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు ఆదేశాల మేరకు మంతెన మధు ఇంటి నుంచి పిప్పిరి విజయ్ ఇంటి వరకు రోడ్డు పనులు చేపట్టారు.వర్షాకాలంలో బురద సమస్యలు ఎదుర్కొంటున్న కాలనీవాసులకు ఈ రోడ్డు ఉపశమనం కలిగించనుంది. రాకపోకలు సులభతరం అవడంతో పాటు గ్రామంలో పారిశుధ్యం, సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు సూచించారు. పనులు ప్రారంభం కావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు

# మహబూబాబాద్‌లో వాహనాల బహిరంగ వేలం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, మహబూబాబాద్, జిల్లా ప్రతినిధి :**
మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా సారాయి, బెల్లం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. వరంగల్ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు, మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారి కిరణ్ ఆదేశాల మేరకు ఈ నెల 23వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం పాట నిర్వహించబడుతుంది. ఈ సందర్భంగా ప్రొహిబిషన్ డ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ చిరంజీవి మాట్లాడుతూ, వేలంలో పాల్గొనదలచిన వారు వాహనాల అంచనా ధరలో 50 శాతం డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ముందుగా వాహనాలను పరిశీలించి వేలంలో పాల్గొనవచ్చని చెప్పారు. వేలంలో వాహనం దక్కిన తర్వాత తీసుకోని యెడల డిపాజిట్ జప్తు చేయబడుతుందని, వాహనం రాకపోతే డిపాజిట్ తిరిగి చెల్లించబడుతుందని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ సమర్పణ తప్పనిసరి అని తెలిపారు. దరఖాస్తులు ఏప్రిల్ 18 నుండి 23వ తేదీ ఉదయం 9 గంటల వరకు మాత్రమే స్వీకరించబడతాయి. వేలంలో వాహనం పొందిన వారు అదే రోజు పూర్తి అమౌంట్‌తో పాటు జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

# నల్ల బ్యాడ్జీలతో గిరిజన ఉపాధ్యాయుల నిరసన

### ఎ సి ఎం ఓ పూర్కా ఉద్దవ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా తీర్యాని మండల టీజేఏసీ పిలుపు మేరకు గిన్నెధరి ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన నిర్వహించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఈ కార్యక్రమం చేపట్టి ప్రభుత్వానికి తమ డిమాండ్లు తెలియజేశారు.పీఆర్సీ ప్రకటించి 51% ఫిట్‌మెంట్ ఇవ్వాలని, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సీఆర్‌టీలకు కనీస టైమ్ స్కేల్ అమలు చేయడం, పెండింగ్ బిల్లులు, డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు పెంచాలని సూచించారు. సమస్యలు పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పూర్కా ఉద్దవ్, నైతం కృష్ణారావు, రాథోడ్ రవీందర్, మాడావి గోపాల్, వెడ్మ యశ్వంత్‌రావు, కూడ్మేత అనంత్, అడా వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# డోర్నకల్‌లో రెండు గంటల విద్యుత్ నిలిపివేత

### నిర్వహణ పనుల దృష్ట్యా సరఫరా నిలిపివేత
### వినియోగదారుల సహకారం కోరిన ఏఈ మోటే కిరణ్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :**
డోర్నకల్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో రేపు (ఏప్రిల్ 18, శనివారం) ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. 11 కేవీ విద్యుత్ లైన్‌పై చెట్ల కొమ్మల తొలగింపు మరియు మరమ్మత్తు పనులు నిర్వహించనున్నట్లు ఏఈ మోటే కిరణ్ వెల్లడించారు.ఈ అంతరాయం డోర్నకల్ పట్టణంతో పాటు బంజర, అమ్మపాలెం, సీతారాంపురం, ఉయ్యాలవాడ, చాప్ల తండ గ్రామాల్లో అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. కావున వినియోగదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని, శాఖకు సహకరించాలని అధికారులు కోరారు.

# యాదగిరిగుట్టలో తాసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన టీఈజేఏసీ నాయకులు

### రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదగిరిగుట్ట రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల పెండింగ్ డిమాండ్ల పరిష్కారాన్ని కోరుతూ గురువారం రాష్ట్రవ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు చేపట్టారు. తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా యాదగిరిగుట్టలో తాసిల్దార్ గణేష్ నాయక్ కు వినతి పత్రం అందజేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా జూన్ 2 నాటికి పిఆర్సి అమలు చేయాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ను అమల్లోకి తీసుకువచ్చి అందరికీ హెల్త్ కార్డులు జారీ చేయాలని తెలిపారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపిఎస్) పునరుద్ధరించాలని, 2004 సెప్టెంబర్ 1కు ముందు నియామకమైన ఉద్యోగులకు ఓపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, గత ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా 61 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సాధారణ బదిలీలు చేపట్టాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు నారాయణ, సైదారావు, యాదగిరి, రామ్మోహన్‌రావు, రాజు, దయాకర్‌రెడ్డి, రామ్మూర్తి, గడ్డమీది పాండురంగం, అక్బర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# జోగిపేట సబ్ జైల్‌లో ట్రాన్సిట్ హోం పనుల పరిశీలన

### పరిశీలించిన ఎం. శ్రీనివాస్, ఐజిపి అడిషనల్ డిసిపి క్రైమ్స్.



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, సంగారెడ్డి ప్రతినిధి:** జోగిపేట సబ్ జైల్‌లో ఏర్పాటు చేస్తున్న ట్రాన్సిట్ హోం (విదేశీయుల కేంద్రం)ను ఐజీ ఎం.శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను సమగ్రంగా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. విదేశీయులు అనుకూలంగా ఉండే విధంగా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ ట్రాన్సిట్ హోంను త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, నిర్మాణ పనులు నాణ్యతగా, సమయానికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్శనలో ఐజీ వెంట సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, డీసీపీ కృష్ణ చైతన్య, డిఎస్పీ సత్తయ్య గౌడ్, జోగిపేట ఇన్స్పెక్టర్స్ అనిల్ కుమార్, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పి.ఆర్.సి అమలు చేయాలి ఉద్యోగుల డిమాండ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
రాజపేట టీజిఈ జేఏసి పిలుపు మేరకు పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని, డిఏ లు ప్రకటించాలని, పిఆర్సి అమలు, సిపిఎస్ రద్దు, హెల్త్ స్కీమ్ అమలు, టెట్ రద్దు, ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కొరకు నల్ల బ్యాడ్జీలను ధరించి రాజపేట మండల ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తాసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.మధుసూదన్, జె.మహేందర్, ఎస్.సుబ్బరాజు, జీ.బాలరాజు, డి.జానయ్య, పి.సత్యానంద్, బి.మహేందర్ రెడ్డి, ఎంపివో కిషన్, ఎంపీడివో కార్యాలయ సిబ్బంది, తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

# తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచారు

### బేషరతుగా బిజెపి ఎంపీ తేజస్వి క్షమాపణలు చెప్పాలి
### బిఆర్ఎస్ పార్టీ కొత్తూరు మండలం ఎస్టీ సెల్ అధ్యక్షులు బిచ్య నాయక్ డిమాండ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, షాద్నగర్ :**
తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై బిఆర్ఎస్ పార్టీ కొత్తూరు మండలం ఎస్టీ సెల్ అధ్యక్షులు బిచ్య నాయక్ మండిపడ్డారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ వేదికగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్య వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.దశాబ్దాల పోరాటం, వేలాదిమంది యువత త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణను రక్తపాతంతో కూడిన దేశ విభజనతో పోల్చడం అమరవీరుల త్యాగాలను అవమానించడమేనని ఆయన మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ రాజ్యాంగబద్ధంగా జరిగిందని గుర్తు చేస్తూ ఈ రాష్ట్రం నేడు దేశానికే ఆదర్శంగా నిలవడాన్ని బీజేపీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. ఒకవేళ తెలంగాణ ఏర్పాటు భారత్-పాక్ విభజన వంటిదే అయితే ఆనాడు పార్లమెంట్‌లో బీజేపీ ఈ బిల్లుకు ఎందుకు మద్దతు ఇచ్చిందని ఆయన ప్రశ్నించారు.గతంలో ప్రధాని మోదీ కూడా రాష్ట్ర ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని,ఇప్పుడు తేజస్వి సూర్య అదేబాటలో నడుస్తూ విషం చిమ్ముతున్నారని ఆయన ధ్వజమెత్తారు.

# రాష్ట్ర ర్యాంకులతో మెరిసిన హాసిని... ఉప్పరగూడెంలో ఘన సత్కారం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :**
సిరోల్ మండలం ఉప్పరిగూడెం గ్రామంలో విద్యా రంగంలో అద్భుత ప్రతిభను చాటుతూ రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన ఉప్పరగూడెం గ్రామానికి చెందిన ఆకోజు హాసిని గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ఆకోజు శ్రీనివాస్ -- అనిత దంపతుల కుమార్తె అయిన హాసిని ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌లోనే రాష్ట్ర ర్యాంకును అందుకోగా, సెకండ్ ఇయర్‌లో 991 మార్కులు సాధించి మరోసారి ప్రతిభను నిరూపించింది. హాసిని సాధించిన ఈ విశేష విజయాన్ని పురస్కరించుకుని గ్రామంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఆమెను అభినందిస్తూ శాలువా కప్పి సత్కరించారు. కృషి, పట్టుదలతో ముందుకు సాగితే ఉన్నత లక్ష్యాలు సాధ్యమవుతాయని ఆమె విజయం స్పష్టం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కొండపల్లి శ్రీదేవి, సిరోల్ మాజీ ఎంపీటీసీ భోజనాయక్, తాళ్ల సంకీసా సర్పంచ్ చింతమల రాజు, రైతు కోఆర్డినేటర్ సముద్రాల శ్రీనివాస్, ఉప్పరగూడెం మాజీ సర్పంచ్ కాలం తిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్ తోట రమేష్, గ్రామ పెద్దలు సముద్రాల బాలయ్య, వార్డు సభ్యులు కాత్రేవుల మహేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. హాసిని భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి గ్రామానికి, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన జర్నలిస్టుకు అండగా నిలిచిన సహచరులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :** ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గానికి చెందిన రిపోర్టర్ సృజన్‌ను శుక్రవారం డోర్నకల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొప్పుల సతీష్ పరామర్శించారు. సృజన్ ను నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ, ప్రమాదం నుంచి త్వరగా కోలుకొని మళ్లీ విధుల్లో చేరాలని ఆకాంక్షించారు. సృజన్‌కు ధైర్యం చెప్పుతూ అతనికి మానసికంగా ఉత్సాహాన్ని నింపారు. అదేవిధంగా తన వంతుగా ఆర్థిక సహాయం అందజేసి సహృదయతను చాటుకున్నారు. సహచర జర్నలిస్టులు కూడా సృజన్‌కు అండగా నిలుస్తామని పేర్కొంటూ, అవసరమైన ప్రతి సహాయం అందిస్తామని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో రిపోర్టర్లు శ్రీనాథ్, కృష్ణతో పాటు పలువురు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం బేగంపేట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు తొందరగా పూర్తి చేయావలసిందిగా వారికి తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు పెంట గోపాల్ మాట్లాడుతూ... ప్రభుత్వం విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆలేరు నియోజకవర్గంలో ఇల్లు లేని వారికి సొంత ఇల్లు ఉండాలని కాంగ్రెస్ ప్రజా పాలనలో అర్హులైన వారికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు పెంట గోపాల్, కాసుల భాను, బైర పాండురంగం, సర్పంచ్ ఇండ్ల అనూష, గ్రామ సెక్రెటరీ దేవమణి, కారోబర్ నర్సింగ్, హౌసింగ్ ఏఈ వివేకానంద, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

## హిందూ సమ్మేళనానికి

# భారీ ఏర్పాట్లు

### అన్నదాతగా జువ్వాజీ అనిల్ గౌడ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండల కేంద్రంలోని స్థానిక శ్రీ రామాలయ ప్రాంగణంలో ఈనెల 26న నిర్వహించనున్న హిందూ సమ్మేళనం కార్యక్రమానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆధ్యాత్మిక మహోత్సవానికి అనిల్ అన్న యువ సైన్యం ఫౌండర్, జువ్వాజీ అనిల్ గౌడ్ అన్నదాతగా వ్యవహరించనున్నారు. శుక్రవారం నిర్వహణ కమిటీ సభ్యులు అనిల్ గౌడ్‌ను కలిసి కార్యక్రమ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ గౌడ్ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు, సమాజ ఐక్యతకు ఇలాంటి సమ్మేళనాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ నెల 26న జరిగే కార్యక్రమానికి తరలివచ్చే భక్తులకు, హిందూ సోదర సోదరీమణులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తన వంతుగా పూర్తిస్థాయిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన హామీ ఇచ్చారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ సమ్మేళనాన్ని అందరూ అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. నిర్వహణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు నిర్వహిస్తున్న ఈ సమ్మేళనానికి అనిల్ గౌడ్ ముందుకు వచ్చి అన్నదాన బాధ్యతను స్వీకరించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కన్నెపల్లి సర్పంచ్ తుమ్మరం మాన్కు, సారా శంకర్, పులి వెంకటేష్, రంగు అరుణ్, గందె ప్రసాద్, తిరుపతి, శ్రీనివాస్, గోపాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ పార్టీ మరియు బిజెపి పార్టీ నుండి

# బీఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు

**శంకరంపేట్ (అ) మండలంలో ఖాళీ అవుతున్న కాంగ్రెస్ పార్టీ**

**మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీమంత్రి హరీష్ రావు చేతులమీదుగా గులాబీ కండువా కప్పుకున్న నాయకులు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, నారాయణ ఖేడ్ :** మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు హైదరాబాద్ కోకాపేట్ లోని తన నివాసం వద్ద,
నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో శంకరంపేట్ (అ) మండలం శివయ్య పల్లి గ్రామానికి చెందిన దాదాపు 30 కుటుంబాలకు చెందినవారు కాంగ్రెస్ పార్టీ నుండి బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరితమైన మాటలతో ప్రజలను మోసాలు చేస్తూ.. మభ్యపెడుతున్నారని... ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి, గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు రౌడీయిజం గుండాయిజం చేస్తున్నారని అందుకని ఆ పార్టీ మీద విరక్తి చెంది. అభివృద్ధి బి ఆర్ ఎస్ పార్టీతోనే సాధ్యమని నమ్మకంతో... కెసిఆర్, కేటీఆర్, హరిశన్న, భూపాలరెడ్డి ఆధ్వర్యంలో గ్రామాలు అభివృద్ధి చెందుతాయాన నమ్మకంతో బీఆర్ఎస్ పార్టీలో చేరామని చెప్పారు.

**పార్టీ లో చేరినవారు:**
స్వతంత్ర అభ్యర్థిగా సర్పంచ్ కి పోటీ చేసిన చిలకమ్మక్కు మల్లేశం, వార్డ్ సభ్యులు
చిలకముక్కు వెంకటేశం వార్డ్ సభ్యులు దండు నర్సింలు, దండు చంద్రయ్య, కుక్కల బేత్తయ్య, కొంపల్లి ప్రవీణ్, కొంపల్లి రత్నయ్య, రాములు తదితరులు చేరారు.

**బిజెపి పార్టీ నుండి బీ ఆర్ ఎస్ పార్టీ లో చేరిక**
శంకరంపేట్ (అ) మండలం కట్టెల వెంకటాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పెరమాండ్ల భాను బీజేపీ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ



కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ రైతుబంధు సురేష్ గౌడ్, బూత్కూరి సుభాష్, మాజీ ఎంపీటీసీ దత్తు, మాజీ సొసైటీ వైస్ చైర్మన్ అంజయ్య, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, కుక్కల అంజయ్య, దండు శ్రీనివాస్, చిన్న కట్ట మల్లేశం, కుక్కల సాయిలు, చంద్రకాంత్,దుర్గయ్య, జహంగీర్, నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలను అంతం చేద్దాం

# ఆడపిల్లలకు బంగారు భవిష్యత్తును అందిద్దాం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
బాల్య వివాహలకు వ్యతిరేకంగా గోడ పత్రిక ఆవిష్కరణ: జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిని విద్యా చందన జిల్లా సంక్షేమ అధికారిని స్వర్ణలత లెనినా ఎయిడ్ సంస్థ వారి ఆధ్వర్యంలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వారి సౌజన్యంతో బాల్య వివాహాల నిర్మూలనకై గోడ పత్రికను ఆవిష్కరించడం జరిగింది. బాల్య వివాహాల నిర్మూలనకై అందరూ నడుం బిగించాలని బాలల యొక్క భవిష్యత్తుకు ఎంతో కీలకంగా అని, బాల్య వివాహాలు అనేవి ఒక సామాజిక దురాచారం, అనదిగా కొనసాగుతున్నటువంటి ఈ సాంఘిక దురాచారాన్ని అందరం కలిసి సమూలంగా నిర్మూలించాలని బాల్య వివాహం అనేదే లేని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కై నిరంతరం శ్రమించాలని విద్యాచందన పిలుపునిచ్చారు. ఏప్రిల్ 19 అక్షయ తృతీయ సందర్భంగా యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను ఆమె చాంబర్లో ఆవిష్కరించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అనునిత్యం గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని బాలల పరిరక్షణ విభాగం ద్వారా బాలలకు సేవలను అందిస్తున్నట్లు తెలిపారు . చిన్న వయసులోనే వివాహం చేయడం వల్ల బాలికలకు శారీరక మానసిక ఆరోగ్య రుగ్మతలు వస్తాయని సరైన పరిపక్వత లేక పుట్టే పిల్లలు కూడా అనేక రకాల లోపాలతో పుట్టడం వల్ల జీవితాంతం ఆ మనోవేదన అనుభవించాల్సి వస్తుందని కొన్ని సందర్భాలలో మాత శిశు మరణాలు కూడా



జరుగుతాయని ఈ నష్టాల వలన స్త్రీ పురుష నిష్పత్తి కూడా గణనీయంగా పడిపోతుందని డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ స్వర్ణలత లెనినా తెలిపారు. ఈ కార్యక్రమంలో డి సమ్మక్క డిపిఎం, నర్మద డీపీఎం, అనురాధ ఏపిఎం ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వి రాజేష్ కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్స్ మోహన్ , మాన్సింగ్,జ్యోతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# అర్రైవ్ అలైవ్ రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న డి.ఎస్.పి ఆదినారాయణ టూ టౌన్ సిఐ ప్రతాప్ ఆధ్వర్యంలో కార్యక్రమం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
రుద్రంపూర్‌లోని ఆర్ సి ఓ ఏ క్లబ్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రహదారులు ప్రమాదాల నివారణ పోలీస్ డిపార్ట్మెంట్ టూ టౌన్ సిఐ ప్రతాప్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఎస్పీ ఎన్. ఆదినారాయణ కొత్తగూడెం ఏరియా జీఎం ఎం. షాలెం రాజు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి పౌరుడి బాధ్యత అత్యంత కీలకమని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరిగా చేయాలని సూచించారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం సమాజ అభివృద్ధికి అవసరమని, ప్రతి వ్యక్తి బాధ్యతాయుతంగా ప్రవర్తించడం ద్వారా భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. . మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ ఉపయోగించకపోవడం వంటి కారణాలు ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. గ్రామస్థాయిలో గ్రామసభల ద్వారా రహదారి భద్రతపై తీర్మానాలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా రహదారి భద్రతను పాటించాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది ప్రమాదాలను తగ్గించే దిశగా కృషి చేయాలని అన్నారు. రహదారి ప్రమాదాల నివారణకు అవగాహన అత్యంత ముఖ్యమైనది. అర్రైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. ముఖ్యంగా విద్యార్థులు, యువత ముందుకు వచ్చి సమాజంలో రహదారి భద్రతపై చైతన్యం కల్పించాలి. ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, వేగ పరిమితులు పాటించడం వంటి అంశాలను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలి. రహదారి భద్రతను ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా తమ బాధ్యతగా భావించి సహకరించాలి. రోడ్డు భద్రత



ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించి, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీఎస్పీ ఎన్. ఆది నారాయణ కొత్తగూడెం ఏరియా జీఎం ఎం. షాలెం రాజు, 2 టౌన్ సీఐ ప్రతాప్, చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు వన్ టౌన్ సిఐ కరుణాకర్ త్రీటౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి వీటీసీ మేనేజర్ లక్ష్మణ్ ఎమ్మార్వో నాగరాజు ట్రాఫిక్ ఎస్సై ప్రవీణ్ కుమార్ టూ టౌన్ ఎస్ఐ మనీషా ఎంపీడీవో సుభాషిని గవర్నమెంట్ డాక్టర్లు 19వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ స్వప్న రుద్రంపూర్ సర్పంచ్ బానోత్ కేస్లీ గౌతమ్ పూర్ సర్పంచ్ కళ్యాణి ధన్బాద్ సర్పంచ్ జ్యోతి జర్నలిస్టులు అధికారులు ఆటో డ్రైవర్లు, పాఠశాల విద్యార్థులు, అప్రెంటిస్‌లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పశ్చిమ గోదావరి జిల్లాలో రూ. 2.27 కోట్లతో పట్టుబడ్డ పాస్టర్.!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, ఆంధ్రప్రదేశ్:** పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో ఒక సామాన్య పాస్టర్ ఇంట్లో బయటపడిన కోట్ల రూపాయల నగదు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది. పక్కా సమాచారంతో పోలీసులు నిర్వహించిన మెరుపు దాడుల్లో.. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. ఓ సారి స్టోరీపై లుక్కేయండి.పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో కోట్ల రూపాయల నగదు నిల్వ వ్యవహారం కలకలం రేపింది. అందులోనూ ఒక సామాన్య పాస్టర్ ఇంట్లో పెద్ద ఎత్తున నగదు నిల్వలు ఉండటం తీవ్ర చర్చకు దారితీసింది. నిల్వ ఉంచిన డబ్బుకు లెక్కలు లేకపోవడంతో వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఓ పాస్టర్ ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. అక్కడ కోట్ల రూపాయల లిక్విడ్ క్యాష్ చూసేసరికి పోలీసుల కళ్లు చెదిరాయి .వీరికి కోట్ల రూపాయలు ఎక్కడివి.? హైదరాబాద్‌లో వీరి వ్యాపారం ఏంటి.? అనే దానిపై పోలీసులు ప్రస్తుతం ఆరా తీస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం పీచుపాలెంలో నివాసం ఉంటున్న పాస్టర్ ఘంటా జాన్ బాబూరావు ఇంట్లో ఈ నగదు దొరికింది. పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేయగా.. లెక్కలలో లేని రూ. 2.27 కోట్లు గుర్తించారు. నగదుపై పాస్టర్ కుటుంబ సభ్యులను ప్రశ్నించగా.. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో పోలీసులు నగదును సీజ్ చేశారు.



పాస్టర్ అల్లుడు శాంసన్ హైదరాబాద్ నుంచి నరసాపురం అనధికార నగదు రూ. 50 లక్షలు తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఇంటికి రాగానే దాడి చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇంట్లో సోదాలు చేయగా మిగతా నగదు దొరికింది. నగదు గురించి పొంతన సమాధానాలు చెప్పడంతో పాస్టర్ జాన్ బాబూరావు, శాంసన్‌లపై కేసు నమోదు చేసి.. వీరికి ఈ నగదు ఎలా వచ్చింది.? ఎక్కడి నుంచి వచ్చింది.? వీరి కుటుంబ సభ్యుల వ్యాపారాలుపై పోలీసులు విచారణ చేపట్టారు. నగదును ఐటి శాఖకు అప్పజెప్పనున్నట్లు రూరల్ సిఐ దుర్గప్రసాద్ తెలిపారు. ఈ నగదు మార్పిడిలో హవాలా కోణం ఉందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

**న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలి**

**తెలంగాణ ఉద్యోగుల జేఏసీ డిమాండ్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శుక్రవారం తెలంగాణ ఎంప్లాయిస్ టీచర్స్ & పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈ జేఏసీ) పిలుపులో భాగంగా కొత్తగూడెం ఆర్డీవో కి వినతిపత్రం అందించడం జరిగిందని జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా టీజీఈజేఏసీ ప్రకటించిన కార్యచరణలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో స్థానిక తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పించిన అనంతరం వారు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న ఉద్యోగుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని కోరారు. టీజీఈ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వౌడాల రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్ళిన అనేక సమస్యలలో కొన్ని సమస్యలు పరిష్కారమైనప్పటికీ ఇంకా అనేక సమస్యలు, నేటికి పెండింగ్లోనే ఉన్నాయని అవేదన వ్యక్తం చేశారు.ఇదే విషయాన్ని వివిధ రూపాలలో సీఎస్, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని, పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని వారు కోరారు. జూన్ 2వ తేదీ నాటికి ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించాలని తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ మండల ప్రతినిధులు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ కార్యాచరణ ఉంటుందన్నారు. 2026 జూన్ 2వ తేదీనాటికి పీఆర్సీ అమలుతో పాటు పెండింగులో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్స్ అన్నీ క్లియర్ చేయాలని, అలాగే రిటైర్డ్ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డ్స్ జారీ చేసి తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానంను పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు నోటిఫికేషన్ వేసి తర్వాత నియామకమైన ఉద్యోగులకు వెంటనే ఓపీఎస్ విధానమును అమలు చేయాలని కోరారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఎల వారసుల ఉద్యోగ నియామక సమస్యను సత్వరం పరిష్కరించాలని కోరారు. అలాగే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. త్వరలో జనాభా లెక్కల కార్యక్రమం ఉన్నందున ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సాధారణ బదిలీలు చేపట్టాలన్నారు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేక కార్య కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కోట రవికుమార్ అధ్యక్షులు టీజిటిఏ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా; ఎం అశోక్ కుమార్ ప్రధాన కార్యదర్శి టి జి టి ఏ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా : బి. గన్యా నాయక్ వైస్ ప్రెసిడెంట్ టి జి టి ఏ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా; ఎమ్ ఎ రాజు అధ్యక్షులు టిజిటిఏ ఖమ్మం జిల్లా; భద్ర నాయక్ అధ్యక్షులు టీజీ ఆర్ ఎస్ఏ భద్రాద్రి జిల్లా; హాసన్ ఖాన్ తాసిల్దార్ రిటైర్డ్; జె నారాయణరావు తాసిల్దార్ రిటైర్డ్ ; బి లక్ష్మణ్ అసోసియేట్ ప్రెసిడెంట్స్ టి జి ఆర్ ఎస్ ఎ. భద్రాద్రి;. తిరుమల నయాబ్ తాసిల్దార్; బుల్లి బాబ సీనియర్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో 20 రోజుల నుండి

# వడ్ల కొనుగోలుకై రైతుల ఎదురుచూపులు

**తక్షణం వడ్లు కొనుగోలు ప్రారంభించాలి**
**కే.వి.రమణ బిఆర్ఎస్ నాయకులు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
బూర్గం పహాడ్ మండల కేంద్రంలో నేడు బిఆర్ఎస్ నాయకులు కే వి రమణ వ్యవసాయ మార్కెట్ ను సందర్శించి రైతుల బాధలు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కే వి రమణ మాట్లాడుతూ గత 20 రోజుల నుండి వరి కోతలు జరుగుతుండగా వడ్లు వ్యవసాయ మార్కెట్లలో, రోడ్ల ప్రక్కన, రైతుల కల్లాల్లో వడ్లు ఆరబోసుకుని కొనుగోలుకై కళ్ళు కాయలు కాసేలా రైతులు ఎదురుచూస్తున్నారు. గత కెసిఆర్ ప్రభుత్వంలో వ్యవసాయం పండుగలా జరిగిందని ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో పంట కొనుగోలుకై ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొని ఉన్నదని రైతులు వాపోతున్నారని ఎద్దేవా చేశారు. అకాల వర్షాలు సంభవించి పంట కొట్టుకుపోతుందేమోనని రాత్రనకా పగలనకా పంటను కాపలా కాస్తు రైతులు గజగజ వణుకుతున్న పరిస్థితి కడు దయనీయంగా ఉందని విచారం వ్యక్తం చేశారు.ఈ అవకాశంతో అందిని కాడికి దోచుకుంటున్న వ్యాపారస్తులు వ్యాపారస్తులు ఇదే అదునుగా భావించి అరా కోరా చెల్లించి రైతులను నిండా ముంచుతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు సరైన మద్దతు ధర చెల్లించకుండా రకరకాల కారణాలతో అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి కొనుగోలు ప్రారంభించాలి ప్రభుత్వం తక్షణం మొద్దు నిద్ర వీడి పంట అకాల వర్షాలకు గురికాకుండానే రైతుల వరి పంటను కొనుగోలు చేయాలని బిఆర్ఎస్ నాయకులు కే వి రమణ డిమాండ్ చేశారు.

# ద్వంద్వ పౌరసత్వం ఇష్యూ: రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని అలహాబాద్ హైకోర్టు ఆదేశం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, సెంట్రల్ డెస్క్ :** ద్వంద్వ పౌరసత్వం ఇష్యూ: రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని అలహాబాద్ హైకోర్టు ఆదేశం లక్నో: కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి బిగ్ షాక్ తగిలింది. ద్వంద్వ పౌరసత్వం వ్యవహారంలో రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని అలహాబాద్ హైకోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వమైనా చేపట్టాలి లేదంటే ఏదైనా కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని హైకోర్టు సూచించింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ద్వంద పౌరసత్వం ఉందని కర్ణాటకకు చెందిన విఘ్నేష్ శిశిర్ అనే న్యాయవాది లక్నోలోని ప్రత్యేక ఎంపీ/ఎమ్మెల్యే కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాహుల్ గాంధీకి ఇండియాతో పాటు బ్రిటన్ సిటిజన్ షిప్ కూడా ఉందని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన సాక్ష్యాలు తన దగ్గర ఉన్నాయని తెలిపారు. భారత చట్టాల ప్రకారం ద్వంద్వ పౌరసత్వం అనుమతించబడదని.. మరొక దేశం పౌరసత్వాన్ని తీసుకున్న తర్వాత భారత పౌరసత్వం రద్దు చేయబడుతుందని పిటిషన్లో పేర్కొన్నారు. భారత చట్టాలకు విరుద్ధంగా డ్యుయెల్ సిటిజన్షిప్ కలిగి ఉన్న రాహుల్ గాంధీపై కేసు నమోదు చేసి విచారణకు ఆదేశించాలని కోరారు.కానీ ప్రత్యేక ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు విఘ్నేష్ శిశిర్ పిటిషన్?ను తిరస్కరించింది. పౌరసత్వానికి సంబంధించిన విషయాలపై నిర్ణయం తీసుకునే అధికారం తమకు లేదని ట్రయల్ కోర్టు స్పష్టం చేసింది. దీంతో ట్రయల్ కోర్టు ఉత్తర్వులను అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్?లో సవాల్ చేశారు. ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన లక్నో బెంచ్.. ద్వంద పౌరసత్వం ఆరోపణలపై రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కేసు విచారణను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వమైనా లేదా కేంద్ర దర్యాప్తు సంస్థకైనా అప్పగించాలని సూచించింది.

# గ్రామాలలో అప్రమత్తతతోనే చోరీల నియంత్రణ సాధ్యం : ఎస్ఐ లింగారెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** గ్రామాలలో చోరీల నియంత్రణ కేవలం అప్రమత్తతతోనే సాధ్యమని ప్రతి ఒక్కరూ బాధ్యతతో మెలగాలని రాజపేట ఎస్ఐ లింగారెడ్డి అన్నారు. రాజపేట మండలం పుట్టగూడెం, కొండ్రెడ్డి చెరువు, రాజపేట, నరసాపురం తదితర గ్రామాల్లో గ్రామస్తులతో కలిసి ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అపరిచితులను నంబరు లేని వాహనాల సమాచారాన్ని అనుమానాస్పద వ్యక్తుల వివరాలను వెంటనే సంబంధిత గ్రామపంచాయతీ పోలీసులకు లేక తనకు తెలియజేయాలని అన్నారు. ఆరుబయట నిద్రించడం తప్పని పరిస్థితుల్లో ఇతర గ్రామాలకు వెళ్తే విలువైన వస్తువులు బంగారు వెండి నగదును ఇండ్లలో ఉంచరాదన్నారు. గ్రామస్తులు సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేయాలన్నారు.వేసవి కాలంలో గ్రామాల్లో దొంగతనాల జరిగే అవకాశాలు కొంచెం ఎక్కువగా ఉండొచ్చు అందుకే గ్రామస్థులు కొంత జాగ్రత్తగా ఉండటం చాలా అవసరం అని వివరించారు.ఇంటి తలుపులు, కిటికీలు బలంగా ఉండేలా చూసుకోవాలని, రాత్రి పడుకునే ముందు తప్పనిసరిగా లాక్ చేయాలన్నారు. బయటకు వెళ్తే పొరుగువారికి చెప్పాలని, విలువైన వస్తువులు (బంగారం, నగదు) ఇంట్లో కాకుండా బ్యాంకులో ఉంచడం మంచిదని తెలిపారు. ఇంటి బయట, లోపల లైటింగ్ బాగా ఉండేలా ఏర్పాటు చేయాలని, గ్రామంలో కొత్తగా కనిపించే అనుమానాస్పద వ్యక్తులపై గమనిక పెట్టాలని, అనుమానం ఉన్నప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రాత్రి సమయాల్లో ఒంటరిగా తిరగకుండా ఉండాలని, గ్రామంలో నైట్ వాచ్ (రాత్రి గస్తీ) ఏర్పాటు చేయాలన్నారు.




ప్రతి వీధిలో ఒకరికొకరు సహాయం చేసుకునే విధంగా గ్రూపులు ఏర్పాటు చేయాలని ఎస్ఐ వివరించారు. అత్యవసర పరిస్థితుల కోసం పోలీస్ నంబర్లు అందరికీ తెలియజేయాలని సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మొబైల్ ఫోన్లలో ఎమర్జెన్సీ నంబర్లు సేవ్ చేసుకోవాలని ఎస్ఐ లింగారెడ్డి తెలిపారు.

# ఆదివాసి మహాసభల విజయానికి ఆహ్వాన సంఘం ఏర్పాటుకు పిలుపు....



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి::**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర 4వ మహాసభలు మే చివరి వారంలో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి నెర్పల్లి అశోక్ తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు.మహాసభల్లో సుమారు 300 మంది ప్రతినిధులు పాల్గొననున్నారని, మూడు రోజుల పాటు ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమ విజయానికి ఆహ్వాన సంఘం ఏర్పాటు చేసి ప్రముఖులు, మేధావులు, వ్యాపారవేత్తలు సహకరించాలని కోరారు.కార్యక్రమంలో కోట శ్రీనివాస్, గోడిసెల కార్తీక్, దుర్గం దినకర్ తదితరులు పాల్గొన్నారు

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హరిత

**ఆస్పత్రుల్లో సమయపాలనతోపాటు మెరుగైన వైద్య సేవలు అందించాలి**



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా:కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ హరిత సూచించారు. శుక్రవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజరు, మందుల నిల్వలను పరిశీలించారు.వడగాలుల దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు జాగ్రత్తలు తెలియజేయాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు

# వృత్తి విద్యలో అగ్రస్థానం - కాగజ్‌నగర్ కళాశాల ఘనత




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొముురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కాగజ్‌నగర్ విద్యార్థులు ఈ ఏడాది అద్భుతమైన విద్యా ఫలితాలు సాధించి జిల్లా స్థాయిలో విశిష్ట స్థానాన్ని సంపాదించారు. ముఖ్యంగా వృత్తి విద్యా విభాగంలో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలతో పాటు జిల్లాకు కూడా మంచి పేరు తెచ్చారు.వివరాల ప్రకారం, ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఎం. శృతి కళాశాల మరియు జిల్లా ప్రథమ స్థానాన్ని సాధించగా, మొదటి సంవత్సరం విద్యార్థిని సనఫ్ జరీన్ కూడా అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా ప్రథమ స్థానం పొందింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సి. హెచ్. కల్యాణి ఈ ఇద్దరు విద్యార్థినులను సన్మానించి, శాలువా కప్పి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ, ఈ ప్రతిభావంతులైన విద్యార్థినులు మన జిల్లాకు గర్వకారణమని, వారి విజయం ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. లెక్చరర్ సయ్యదా ఫిర్దౌస్ ఫాతిమా కూడా ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థినులకు అభినందనలు తెలిపారు. కృషి, పట్టుదల మరియు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయం సాధ్యమైందని చెప్పారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు ఇదే విధంగా మరిన్ని విజయాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు

# గంభీరావుపేట అంగన్వాడిలో పోషణ పక్షోత్సవాలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం గంభీరావుపేట అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్షోత్సవాల సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ జుమ్మడి మల్లేశ్వరి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సర్పంచ్ జుమ్మిడి కిష్టయ్య ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారుల శారీరక, మానసిక అభివృద్ధికి పౌష్టికాహారం కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ‘హార్మూజ్’ గేట్లు ఓపెన్.. కనికరించిన ఇరాన్ - ఇక లైన్ క్లియర్..!!




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, సెంట్రల్ డెస్క్:**
పశ్చిమాసియాలో ఉద్రిక్తతల మధ్య ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రపంచ వాణిజ్యానికి అత్యంత ముఖ్యమైన మార్గాలలో ఒకటైన హార్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ నిర్ణయం అంతర్జాతీయంగా పెద్ద ఊరటనిచ్చే అంశంగా మారింది.ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వెల్లడించిన ప్రకారం.. అన్ని వాణిజ్య నౌకల రాకపోకలకు అనుమతి ఇస్తూ హర్మూజ్ జలసంధిని తిరిగి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చినట్టు స్పష్టం చేశారు. లెబనాన్‌లో పరిస్థితులు శాంతించడంతో పాటు.. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నంత వరకు ఈ నిర్ణయం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదికగా కూడా ప్రకటించారు.హర్మూజ్ జలసంధి ప్రపంచంలోనే అత్యంత కీలకమైన ఆయిల్ ట్రాన్సిట్ మార్గాలలో ఒకటి. ప్రపంచ చమురు సరఫరాలో పెద్ద శాతం ఈ మార్గం ద్వారానే సాగుతుంది. కాబట్టి ఈ మార్గం మూసివేయబడితే అంతర్జాతీయ మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఇప్పుడు దీన్ని మళ్లీ తెరవడం వల్ల గ్లోబల్ ఆయిల్ ధరలు స్థిరపడే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.ఇరాన్ పోర్ట్స్ అండ్ మారిటైమ్ ఆర్గనైజేషన్ సమన్వయంలో నౌకల రాకపోకలు సజావుగా సాగుతాయని అధికారులు తెలిపారు. భద్రతా చర్యలను కట్టుదిట్టం చేస్తూ, అంతర్జాతీయ నౌకాయానానికి ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ పరిణామంపై స్పందించిన డొనాల్డ్ ట్రంప్ తన ‘ట్రూత్ సోషల్’ వేదికగా ఇరాన్ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, “హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవడం మంచి పరిణామం. దీనివల్ల ప్రపంచ వాణిజ్యానికి ఊరట లభిస్తుంది” అని వ్యాఖ్యానించారు. ఇరాన్‌కు ధన్యవాదాలు కూడా తెలిపారు.విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ నిర్ణయం కేవలం తాత్కాలిక శాంతికి సంకేతం మాత్రమే కాకుండా, భవిష్యత్తులో అమెరికా–ఇరాన్ మధ్య శాశ్వత శాంతి ఒప్పందానికి కూడా మార్గం సుగమం చేయవచ్చని భావిస్తున్నారు. ఇక హర్మూజ్ జలసంధి తిరిగి తెరవడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, ముఖ్యంగా ఇంధన రంగానికి భారీ ఊరటనిచ్చే నిర్ణయంగా నిలిచింది.ఇటీవల ఇజ్రాయెల్ – లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందాన్ని డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ప్రకటించడం గమనార్హం. ఈ పరిణామం ప్రాంతీయ ఉద్రిక్తతలను తగ్గించడమే కాకుండా, అంతర్జాతీయ వాణిజ్య మార్గాల భద్రతకు కూడా దోహదపడిందని భావిస్తున్నారు. ఈ పరిణామం ప్రాంతీయ శాంతికి ఒక పాజిటివ్ సిగ్నల్‌గా భావించబడుతోంది.

# ఉపాధి హామీ కూలీల సమస్యలు అధికారులు పరిష్కరించాలి

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ డిమాండ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని బట్టుపల్లి, ఎన్‌జీఓ కాలనీ గ్రామాలకు సంబంధించిన ఉపాధి హామీ పనులను పరిశీలించేందుకు దరిగం ఫారెస్ట్‌లో పని ప్రదేశాన్ని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈనెల 21 ఏప్రిల్ న కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద “చలో సబ్ కలెక్టర్ కార్యాలయం” కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ కూలీలపై తీవ్ర ప్రభావం చూపుతున్న రెండు ఫోటోలు విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విధానం వల్ల అనేక మంది కూలీలకు పని దొరకకపోవడం జరుగుతోందని అన్నారు.వికసిత భారత్ జి రామ్ జి పేరుతో ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 44–45 డిగ్రీల తీవ్ర ఎండల్లో పని చేస్తున్న కూలీలకు కనీస సదుపాయాలు అయిన మంచినీరు, టెంట్లు కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోనే పనులు



జరుగుతున్నప్పటికీ, ఏ అధికారి కూడా పనిస్థలాలను సందర్శించి కూలీల సమస్యలను తెలుసుకోవడం లేదని అన్నారు.పనులు చేసిన కూలీలకు కూలి డబ్బులు సమయానికి అందకపోవడం వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. గ్రామాల నుండి 3–4 కిలోమీటర్ల దూరంలో ఉన్న పనిస్థలాలకు వెళ్లడానికి రోజుకు ఒక్కొక్కరికి సుమారు రూ.50 వరకు ఖర్చవుతుందని, ఆ ప్రయాణ ఖర్చులను ప్రభుత్వం భరించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. అలాగే పనిస్థలాల్లో మెడికల్ కిట్ వంటి అత్యవసర సదుపాయాలు కూడా అందుబాటులో లేవని, పనిముట్లు అయిన సభలు, పారా, గంప, కొడవలి, గొడ్డలి వంటి సామగ్రిని ప్రభుత్వం అందించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఉపాధి హామీ కూలీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

## తెలంగాణ ఉద్యోగుల జేఏసీ డిమాండ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి అని కోరుతూ తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ తరపున భువనగిరి ఆర్డీఓ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలి.రాష్ట్రంలో ఉద్యోగులకు సంబంధించిన దీర్ఘకాలికంగా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టాక కొన్ని సమస్యలు పరిష్కారం అయ్యాయి. అయినప్పటికీ మిగతా ఎన్నో సమస్యలు అలాగే పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇవే కాకుండా న్యాయబద్ధమైన డిమాండ్లు సైతం అమలుకు నోచుకోవడం లేదు. ఇదే విషయాన్ని వివిధ రూపాలలో సీఎస్, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. అయినప్పటికీ వారి నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. దీంతో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో భువనగిరి ఆర్డీఓ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఇదే విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని కోరడం జరిగింది. తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) ప్రధాన డిమాండ్లు...జూన్ 2వ తేదీ నాటికి పీఆర్సీ అమలు పరచాలి. రిటైరైన ఉద్యోగులకు పెండింగ్ బిల్స్ అన్నీ క్లియర్ చేయాలి. హెల్త్ కార్డ్స్ తక్షణమే అమలు చేయాలి. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానంను పునరుద్ధరించాలి. 2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు నియామకమైన ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలి. పెండింగ్ బిల్లులతో పాటుగా పెండింగ్ డీఏలను విడుదల చేయాలి. గతంలో ప్రభుత్వం ఇచ్చిన




హామీ ప్రకారం 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సాధారణ బదిలీలు చేపట్టాలి. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) నాయకులు పి.రాధ, తహసిల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఆర్.ఉమా, టిపిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కె.శ్రీధర్, టిపిఎస్‌యు స్టేట్ కన్వీనర్ పి.ఇందుమతి, టిపిఎస్‌యు భువనగిరి పట్టణ అధ్యక్షులు, వనం వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు పి.రవి కుమార్, తహసిల్దార్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు టిజిఆర్ఎస్ఎ ముఖ్య నాయకులు లోకేందర్ రెడ్డి, సైదా సాహెబ్, కల్యాణ్, ప్రణయ్, గుర్రాల బాలకృష్ణ, రాష్ట్ర కోశాధికారి జిపిఓఎస్ అసోసియేషన్ కె.శ్రీనివాస్, జిపిఓఎస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.కల్పన, టిపియుఎస్ మండల కార్యదర్శి, బి.రాఘవ రెడ్డి, పి.సంతోష్ టిపియుఎస్ జిల్లా కోశాధికారి, కిరణ్ కుమార్, టిపియుఎస్ మండల అధ్యక్షులు, మరియు జిపిఓఎస్ మరియు టిజిఆర్ఎస్ఎ నాయకులు ఇస్తారీ, మల్లేష్, శ్యామలత, ఝాన్సీ, సరస్వతి, పాండు, వివేకా, అనిల్, నవీన్, భాను, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నేత హత్య కేసులో దోషిగా కాంగ్రెస్ ఎమ్మెల్యే.. జీవిత ఖైదు విధించిన కోర్టు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, సెంట్రల్ డెస్క్ :**
తన రాజకీయ ప్రత్యర్థిని అత్యంత దారుణంగా హత్య చేశారు. కిరాయి ముఠాలకు సుపారీ ఇచ్చి మరి అడ్డు తొలగించుకున్నాడు. చివరకు ఆయన కుట్ర బయటపడింది. సీబీఐ విచారణలో అతడే ఈ హత్య చేయించినట్టు నిర్ధారణ అయ్యింది. దీంతో కోర్టు ఆయనను దోషిగా నిర్ధారించి, యావజ్జీవిత ఖైదు విధించింది. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేతో పాటు మరో 15 మందిని కోర్టు దోషులుగా తేల్చింది. 2016 నాటి కేసులో తాజాగా తీర్పు వెలువరించింది.కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే బీజేపీ నేత హత్య కేసులో కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేకు న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. బీజేపీ నేత యోగేష్ గౌడ్ హత్య కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వినయ్ కులకర్ణిని ప్రజా ప్రతినిధుల కోర్టు దోషిగా నిర్ధారించింది. 2016 నాటి ఈ హత్య కేసుపై సుదీర్ఘ విచారణ అనంతరం వినయ్ కులకర్ణితో పాటు 16 మందిని దోషులుగా తేల్చి, యావజ్జీవ కారాగార శిక్ష ఖరారుచేసింది. ఈ మేరకు ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సంతోష్ గజానన్ భట్ తీర్పు వెలువరించారు.ఈ హత్య కేసులో ఎమ్మెల్యే ప్రమేయం ఉన్నందున సమాజానికి బలమైన సందేశం పంపేలా శిక్ష విధించాలని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శివానంద పెర్ల , ఎస్. హేమహద్‌లు వాదించారు. ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష విధించాలని విజ్ఞప్తి చేశారు. కానీ, వినయ్ కులకర్ణి తరపున లాయర్లు మాత్రం ఆయనపై కనికరం చూపి శిక్ష తగ్గించాలని అభ్యర్థించారు. అయితే, నేర తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. యావజ్జీవ శిక్షను ఖరారు చేశారు.ధార్వాడ్ జిల్లా పంచాయత్ సభ్యుడైన యోగేష్‌గౌడ గౌడర్ 2016 జూన్ 15న జిమ్‌లో దారుణ హత్యకు గురయ్యారు. ఆయనను దుండగులు కిరాతకంగా నరికి



చంపారు. అప్పట్లో ఈ ఉదంతం కర్ణాటకను కుదిపేసింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. అయితే, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తర్వాత కేసును సీబీఐకి బదిలీ చేశారు. ఈ హత్య వెనుక అప్పటి ధార్వాడ్ జిల్లా ఇంచార్జ్ మంత్రిగా ఉన్న వినయ్ కులకర్ణి పాత్ర ఉందనే ఆరోపణలు వచ్చాయి. తన రాజకీయ ప్రత్యర్థిని అణచివేసేందుకు ఈ హత్యను చేయించారనేది ఆరోపణ. 2016లో ఈ హత్య జరిగితే 2019లో సీబీఐకి బదిలీ చేశారు. దీనిపై 2020లో అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన సీబీఐ.. కులకర్ణిని ప్రధాన కుట్రదారుడిగా పేర్కొంది. తనకు రాజకీయంగా సవాల్‌గా మారుతాడని భావించిన.. కిరాయి హంతకులతో అడ్డు తొలగించుకున్నట్టు తెలిపింది. విచారణలో భాగంగా అదే ఏడాది కులకర్ణిని సీబీఐ అరెస్ట్ చేసింది. కానీ, ఆగస్టు 2021లో సుప్రీంకోర్టు అతడికి బెయిల్ మంజూరు చేసింది. అయితే, సాక్షులను ప్రభావితం చేస్తున్నారనే ఆరోపణలతో బెయిల్‌ను రద్దు చేసింది.జనవరి 2026లో వినయ్ కులకర్ణి బెయిల్ కోసం చేసిన తదుపరి అభ్యర్థనను న్యాయపరమైన చిక్కులను కారణంగా చూపుతూ కర్ణాటక హైకోర్టు తిరస్కరించింది. అప్పటికే సాక్షులందరినీ విచారించారని పేర్కొంటూ ఫిబ్రవరి 27న సుప్రీంకోర్టు ఆయనకు మళ్లీ బెయిల్ మంజూరు చేసింది.

### మాజీమంత్రి ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డికి

# ఆహ్వాన పత్రిక అందజేసిన డిఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ మాజీ మంత్రివర్యులు జిన్నారెడ్డిని ప్రజాభవన్లో కలిసి మే నెల రెండవ తేదీన త్యాగరాయ గానసభ చిక్కడపల్లిలో జరగబోయే శాంతి పురస్కారాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. డిఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యులు లత , సామ ప్రశాంతి, లక్ష్మి ,శకుంతల తదితరులు . కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి మాట్లాడుతూ శాంతి పురస్కారాలకు డాక్టర్ చిన్నారెడ్డి ని ఆహ్వానించడం జరిగింది. డిఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు అభినందనీయులని ఇంత మంచి కార్యక్రమానికి అందరూ వచ్చి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సినీ ప్రొడ్యూసర్ సామ శ్రీధర్, మీసేవ నిర్వాహకుడు గ్రంథం వెంకట నాయుడు ప్రముఖ సామాజిక కార్యకర్త టైగర్ శకుంతల ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు



Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.